
సాక్షి
ప్రకాశం
శనివారం । 31 । ఆగస్టు । 2024


పచ్చతమ్ముళ్ల ధనదాహం
తెలుగు తమ్ముళ్ల ధన దాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కలికివాయ- బిట్రగుంట చెరువులో విలువైన తుమ్మచెట్లను కొట్టేసుకుంటున్నారు.
- 8లో..

ఏసీబీ వలలో విద్యుత్ లైన్‌మెన్

వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేసిన విద్యుత్ లైన్‌మెన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
38/24
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.


ఒంగోలు సంతపేటలోని సాయిబాబా ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కనకనాగర్పమ్మ అమ్మవారికి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


కుంకుమార్చన అనంతరం కనకనాగార్పమ్మ అమ్మవారి మూలవిరాట్టు


ఒంగోలు కొండ మీద శ్రీగిరి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

శుభములొసగు.. వరలక్ష్మీ
శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకటలాడాయి. పలుచోట్ల సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- ఒంగోలు మెట్రో

న్యూస్‌రీల్

సంపూర్ణ అవగాహనతోనే వ్యాపారంలో విజయం

జీవైబీ శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ

ఒంగోలు టౌన్: సంపూర్ణ అవగాహన పెంపొందించుకున్న తరువాత వ్యాపారం ప్రారంభించినప్పుడే విజయం సాధించడం సాధ్యపడుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జనరేట్ యువర్ బిజినెస్ (జీవైబీ) అంశం మీద మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిపుణుల ద్వారా తగిన మార్గదర్శకాలు ఇచ్చేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ చెప్పారు. బ్యాంకు రుణాలకు సంబంధించిన లింకేజీలు, వ్యాపార సంస్థలకు అందుబాటులో వున్న రుణాల వివరాలను డీపీఎం బి.సుబ్బారావు వివరించారు. అనంతరం శిక్షణ పొందిన ఔత్సాహికులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

వర్షానికి ఊపిరి పోసుకున్న కంది

ఒంగోలు సెంట్రల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. తీవ్ర గాలులతో, వర్షాభావ పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంత మేర ఉపశమనం ఇచ్చింది. మరికొంత మేర వర్షం పడితే కానీ వ్యవసాయ పనులు ఊపందుకోవు. జిల్లాలో 38 మండలాలకు గాను 34 మండలాల్లో వర్షపాతం 250.4 మి.మిలు, సరాసరి 6.4 మి.మీలుగా నమోదైంది. అందులో హెచ్‌ఎంపాడు 26.4 మి.మీలు, పొన్నలూరు 20.2, ఒంగోలు, ఒంగోలు అర్బన్ 18.4, పుల్లలచెరువు 14, కేకేమిట్ల 12.8, ఎస్ కొండ 11.2, టంగుటూరు 10.2, కనిగిరి 8.6, తాళ్లూరు 8.2, ఎస్ఎన్ పాడు, రాచర్లలలో 7.8, పొదిలి 7.6, మద్దిపాడు 6.8, కొండపి 6.4, ఎన్‌జీపాడు 6, పామూరు 5.4, త్రిపురాంతకం 5.2, దర్శి, కురిచేడులలో 5, మర్రిపూడి 4.2, పీసీపల్లి, దొనకొండ 3.8 చొప్పున, జరుగుమల్లి, ముండ్లమూరులలో 3.6 చొప్పున, బేస్తవారిపేట 3.2, కొత్తపట్నం 2.6, చీమకుర్తి, మార్కాపురం, గిద్దలూరులలో 2.4 చొప్పున, తర్లు పాడులో 1.8, పెద్దారవీడు, కంభంలలో 1.6 చొప్పున, కొమరోలు, అర్థవీడులలో 1 చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి


మొక్క నాటుతున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (సింగరాయకొండ): జీవుల మనుగడకు మొక్కలే జీవనాధారమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని పంగులూరివారిపాలెంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమంలో మాట్లాడారు. సహజ వనరులు, అడవులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో గ్రీన్ ఏపీగా మార్చాలని సూచించారు. జరుగుమల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముున్నంగి సీ ఫుడ్స్ కంపెనీ మేనేజర్ రామారావు ఆర్థిక సహకారంతో సుమారు రూ.9 లక్షల విలువైన నూతన ట్రాక్టర్‌ను సర్పంచ్ కె. పున్నారావుకు అందజేశారు. ఎంపీపీ బెల్లం నిర్మల, ఎంపీడీఓ జలజాక్షి పాల్గొన్నారు.

స్వామి భక్తి.. ప్రచార కండూతి!
- సింగరాయకొండ గురుకుల పాఠశాలలో జేసీబీతో వంద గుంతలు
- మంత్రి స్వామి, కలెక్టర్ పర్యటన పేరుతో డ్వామా అధికారుల అత్యుత్సాహం
- విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నా ముమ్మరంగా ఏర్పాట్లు
- బయటకు పొక్కడంతో.. రాత్రికి రాత్రే వేదిక ఒంగోలుకు మార్పు
- కేవలం అడుగు లోతున మరో పాతిక గుంతలు తవ్వి కొబ్బరి మొక్కలతో మమ
- ప్రచారం కోసం ఇంత ఆర్భాటం అవసరమా అని స్థానికంగా చర్చ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

విద్యార్థుల భవిష్యత్తు కన్నా ప్రభుత్వ ప్రచార ఆర్భాటమే కూటమి సర్కారు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు ఎక్కువైపోయింది. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు పేరుతో డ్వామా అధికారులు వ్యవహరించిన తీరు అభాసుపాలైంది.


కూలీలతో తవ్వించినట్లు చెబుతున్న గుంత

సాంఘిక సంక్షేమ మంత్రి డీబీవీ స్వామి ప్రచార కండూతిని తీర్చడానికి సింగరాయకొండలోని గురుకుల పాఠశాలను వేదికగా మలిచి 'స్వామి' భక్తిని చాటుకునేందుకు డ్వామా అధికారులు చేసిన ప్రయత్నం ఆఖరి క్షణంలో బెడిసికొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఎం పోషణ్ అభియాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఆర్భాటంగా నిర్వహించేందుకు ఎన్ఆర్ఈజీఎస్‌తోపాటు మండల అధికారులు ముందు రోజు నుంచే సన్నాహాలు ప్రారంభించారు. న్యూట్రీ గార్డెన్ పేరుతో వివిధ రకాలైన పూలు, ఔషధ, కాయగూర మొక్కలు నాటేందుకు 100 గోతులు తీయించారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో గోతులు తీశారు. ఈ సన్నాహక కార్యక్రమాలను డ్వామా పీడీ స్వయంగా పర్యవేక్షించారు. మంత్రి స్వామి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, విద్యార్థినులతో ప్లకార్డులు ప్రదర్శించాలని పాఠశాల ఉపాధ్యాయులకు పీడీ సూచించారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ సమయంలో పంపించడం ఎలా


జేసీబీతో తీసిన గుంతలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

సాధ్యమని అనడంతో పీడీ ఖంగుతిన్నారు. వెంటనే తేరుకుని మంత్రి, కలెక్టర్ వస్తున్నారంటూ ఉపాధ్యాయులను సముదాయించడంతో.. సమయం కచ్చితంగా చెబితే విద్యార్థులను పంపిస్తామని సమ్మతించారు. ఈ తంతు బయటకు పొక్కడంతో గురువారం రాత్రికి రాత్రే మంత్రి కార్యక్రమాన్ని మార్చేశారు. ఇక్కడ జరగాల్సిన కార్యక్రమాన్ని ఒంగోలు భాగ్యనగర్‌లోని కేంద్రీయ విద్యాలయానికి మార్చారు. శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో జేసీ గోపాలకృష్ణ హాజరయ్యారు. మంత్రి స్వామి మాత్రం జరుగుమల్లి మండలం పంగులూరి వారిపాలెంలో మొక్కలు నాటారు.

నిబంధనలకు నీళ్లు..
డ్వామా అధికారులు అత్యుత్సాహంతో పాఠశాల ఆవరణలో తవ్విన గుంతల్లో కూడా నిబంధనలు పట్టించుకోలేదు. వాస్తవానికి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు తీసిన వంద గుంతలను ఉపాధి హామీ పథకం కూలీలతో తవ్వించాలి. కానీ జేసీబీతో గుంతలు తవ్వడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారులు శుక్రవారం ఉదయం మరో 25 గుంతలు తవ్వించారు. ఇవి కేవలం అడుగు లోతు మాత్రమే ఉన్నాయి. అధిక భాగం కొబ్బరి మొక్కలు నాటాయి. ఇవి నాటాలంటే మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల లోతులో గుంతలు తీయాలి. మొక్క నాటేటప్పుడు పశువుల ఎరువు, సూపర్‌ఫాస్పేట్ వేసి గుంత పూడ్చాలి. కానీ ఇవేమి చేయకుండా కేవలం అడుగు లోతు గుంతల్లో కొబ్బరి, ఇతర రకాల మొక్కలు నాటి కార్యక్రమాన్ని మమ అనిపించారు. ఓ వైపు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకమని ప్రచారం చేస్తూ.. క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్న పాలకుల తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


జేసీబీతో తవ్విన గుంత

రోడ్డు ప్రమాదాలు నివారించాలి
- జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. చీమకుర్తి రోడ్డులో రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు జంగిల్ క్లియరెన్స్ చేయాలని దాంతో పాటు రోడ్డును వెడల్పు చేసి అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాలన్నారు. మైన్స్ డిపార్టుమెంట్ సహకారంతో రోడ్లపై గుంతలను పూడ్చాలన్నారు. కర్రల లోడుతో వెళ్లే వాహనాలు రోడ్లపై అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. దర్శి, పొదిలి, కనిగిరి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఒంగోలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు రెండు మూడు ప్రాంతాల్లోనే ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. నంబర్ ప్లేట్లు నిబంధనల మేరకు లేకుంటే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిలో ఉప రవాణా కమిషనర్ సుశీల, అడిషనల్ ఎస్పీ శ్రీశ్రీధర్, ఇతర అధికారులు అమర్‌నాయక్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358
ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధరలు శుక్రవారం గరిష్టంగా కేజీ రూ.358 ధర పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 11,885 బేళ్లు రాగా 9,767 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2118 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 144వ రోజు వేలం పాటలో 5,705 బేళ్లు రాగా 4,834 వ్యాపారులు కొనుగోలు చేశారు. 571 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ. 358, కనిష్టంగా రూ.194 సరాసరి రూ.316.81 వచ్చింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 187వ రోజు వేలం పాటలో 6,180 బేళ్లు రాగా 4933 బేళ్లు కొనుగోలయ్యాయి. 1247 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి రూ.276.24 పలికింది.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి
- ఆత్మహత్య చేసుకుందంటున్న ఆస్పత్రి యాజమాన్యం


రిమ్స్‌లో బాలిక మృతదేహం

ఒంగోలు టౌన్: మానసిక పరిస్థితి బాగా లేదని ఆస్పత్రిలో చేర్పించిన బాలిక అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన నగరంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో జరిగింది. బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం .. నగరంలోని కొత్తడొంకకు చెందిన ప్రేమల ప్రసాద్, స్రవంతి బెంగళూరులో బేల్దారు పనులు చేస్తుంటారు. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. పెద్దమ్మాయి సాత్విక (17) కందుకూరులో పదో తరగతి చేర్పించారు. రెండు నెలల తరువాత తనకు చదువు అర్థం కావడంలేదని చెప్పడంతో ఒంగోలులోని కొత్తడొంకలో అమ్మమ్మ దగ్గర ఉంచింది. కొద్ది కాలంగా మానసికంగా బాధపడుతున్న బాలిక ఇంట్లో పెద్దలకు చెప్పకుండా చీటికీ మాటికీ ఇంటి నుంచి వెళ్లిపోతోంది. దీంతో ఇటీవల హైవే పక్కన ఉన్న సిరి మానసిక వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలిక గురువారం ఫోన్ చేసి తనను ఇంటికి తీసుకెళ్లమని చెప్పింది. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హాస్పిటల్ గదిలో మీ కుమార్తె ఉరేసుకుందని, సీరియస్‌గా ఉందంటూ ఆస్పత్రి సిబ్బంది బాలిక తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఇదే విషయాన్ని పోలీసులకు కూడా సమాచారం అందించారు. అయితే పోలీసులు ఆస్పత్రికి వెళ్లే సరికే బాలిక మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. తన కుమార్తె ఆరోగ్యంగానే ఉందని, ఓవర్ డోసు ఇవ్వడం వలన కానీ, ఎవరైనా కొట్టడంతో తగలరాని చోట దెబ్బ తగలడంతో చనిపోయి ఉంటుందని బాలిక తల్లి స్రవంతి అనుమానం వ్యక్తం చేస్తూ తాలుకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీ..ప్రసన్నం
- తీరు మార్చుకోని అధికారులు
- వనం-మనం ప్రభుత్వ కార్యక్రమంలో గొట్టిపాటి లక్ష్మి ఫొటోలు
- ఏకంగా తహశీల్దార్ కార్యాలయ గోడలకే ఫ్లెక్సీ ఏర్పాటు



గొట్టిపాటి లక్ష్మి ఫొటోతో తహశీల్దార్ కార్యాలయం పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దర్శి: టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మిని ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. పలు మార్లు ప్రొటోకాల్ విషయంలో మీడియా ప్రశ్నిస్తున్నా అవేమీ తమకు పట్టవన్నట్లు తాము కూడా పచ్చనేతలమే అనేలా వ్యవహరిస్తున్నారు. వనం-మనం కార్యక్రమాన్ని నగర పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అయితే ఫ్లెక్సీపై టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి అని ఫ్లెక్సీలో ప్రొటోకాల్‌కు విరుద్ధంగా ఆమె ఫొటో పెట్టి మరీ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఏకంగా తహశీల్దార్ కార్యాలయానికి ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్కడే మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌లు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దర్శి, ప్రకాశం జిల్లా వనం-మనం ప్రకృతి పిలుస్తోంది కార్యక్రమం అని ప్రచురించి పక్కన ప్రభుత్వానికి ఏ సంబంధం లేని గొట్టిపాటి లక్ష్మి ఫొటోను ఏవిధంగా పెడతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఏ కార్యక్రమమైనా ఆ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ఎమ్మెల్యేగా ఉన్న వారికి అధికారులు ఆహ్వానం పంపాలి. ఫ్లెక్సీలో ప్రొటోకాల్ ప్రకారం ఆ ఎమ్మెల్యే ఫొటో వేయాలి. అయితే దర్శిలో అధికారులు మాత్రం ఇక్కడ ఎమ్మెల్యే గా గెలిచిన డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కాదని ఆయనపై ఓడిపోయిన గొట్టిపాటి లక్ష్మి ఫొటో వేసి అధికారిక కార్యక్రమం నిర్వహించడం పై ప్రజలు మండిపడుతున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ లైన్‌మేన్




లంచం తీసుకుంటూ పట్టుబడిన లైన్‌మేన్ సీహెచ్ రామలింగయ్య

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు

రాచర్ల: ఒక రైతు పొలంలో వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ వేసేందుకు లంచం తీసుకుంటున్న లైన్‌మెన్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఒంగోలు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన పొలంలో బోర్లు వేశాడు. వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ కోసం ఈనెల 6వ తేదీన గిద్దలూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నాడు. 14వ తేదీ లైన్‌మెన్ సీహెచ్ రామలింగయ్య.. రైతుకు ఫోన్ చేసి మీ పొలాన్ని చూపిస్తే ఎస్టిమేషన్ వేస్తామని చెప్పగా రైతు కిరణ్ పొలాన్ని చూపించాడు. త్వరగా ఎస్టిమేషన్ వేసి వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేయాలని లైన్‌మెన్‌కు కోరాడు. ఈ సందర్భంగా లైన్‌మెన్ రామలింగయ్య త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ లైన్ లాగాలంటే డీఈ, ఏఈతో మాట్లాడాలని, రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. 23వ తేదీన మళ్లీ లైన్‌మెన్ రామలింగయ్య రైతు వాకా కిరణ్‌తో కలిసి డబ్బులిస్తేనే పని ప్రారంభిస్తానని చెప్పాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని వాకా కిరణ్ ఈ నెల 27వ తేదీన ఒంగోలులోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. రైతు కిరణ్ ఏసీబీ అధికారుల సూచనలతో శుక్రవారం లైన్‌మెన్ రామలింగయ్యకు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అనుమలవీడు సబ్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ వెంట ఏసీబీ సీఐ శేషు, ఎస్సైలు షేక్. మస్తాన్ షరీఫ్, జేబీఎన్.ప్రసాదు తదితరులు ఉన్నారు.

3న జాబ్‌మేళా

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరుడొంక మహిళా ప్రాంగణంలో వచ్చే నెల 3వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఆఫీసర్ రవితేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీలకు చెందిన వారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గలవారు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 99630 05209 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటిన జేసీ



మొక్కలు నాటుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని జేసీ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి పుట్టినరోజుకు ఒక మొక్క నాటాలన్నారు. పారిశ్రామికీకరణ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, రాబోయే తరాలకు మంచి వాతావరణం అందించాలంటే మొక్కలు నాటడం తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ అబ్దుల్ అఫీజ్, డీఎఫ్ఓ సునీత, ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, కనిగిరి అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసరావు, మాజీ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొని మొక్కలు నాటారు.

దర్యాప్తు వేగవంతం కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, పక్కన అడిషనల ఎస్పీలు కె.నాగేశ్వరరావు, యస్‌వీ శ్రీధర్ రావు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోక్సో కేసులు, అత్యాచార కేసుల్లో దర్యాప్తు వేగాన్ని పెంచాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. హత్య, ఇతర కీలకమైన కేసుల్లో శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు చేపట్టాలని, మహిళలు, చిన్నారుల కేసులను లక్ష్యం చేయకూడదని చెప్పారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జరిగిన సమావేశంలో ఎస్పీ వివిధ కేసులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలను సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలు, చట్టపరంమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, రాత్రి సమయంలో రెగ్యులర్ బీట్లతో వాహనాలను తనిఖీలు చేసి దొంగతనాలను అరికట్టాలని, నేర నియంత్రణకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని చెప్పారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, గ్రామాలను సందర్శించి పాత నేరస్తుల ప్రస్తుత స్థితిగతులను విచారించాలని, జైలు రిలీజ్ మానిటరింగ్ ద్వారా పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా చూడాలని, గ్రామ పరిధిలో సమాచార వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని చెప్పారు. ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యత తెలిసేలా అవగాహన కల్పించడమే కాకుండా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, బాధితులకు న్యాయం చేకూరుతుందన్న నమ్మకం కలిగించాలన్నారు. పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, నేరం జరిగిన తరువాత పరిగెత్తడం కంటే నేరం జరగకుండా ముందస్తు ప్రణాళికల ద్వారా అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. కొత్త చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని, నూతన చట్టాలకు అనుగుణంగా పోలీసు స్టేషన్ రికార్డులను నిర్వహించుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసులు తగ్గించుకోవాలని, అరెస్టులు, చార్జిషీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టులో చార్జిషీటు తీసుకున్న వెంటనే సీసీ, పీఆర్‌సీ నెంబర్ తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ కేసుల పరిష్కారంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ప్రశంస పత్రాలను అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) యస్‌వీ శ్రీధర్ రావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రామరాజు, లక్ష్మీ నారాయణ, ఎస్పీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

● విద్యుత్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు



మృతి చెందిన రమేష్

బేస్తవారిపేట: విద్యుదాఘాతానికి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఒందుట్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామంలో నెల రోజుల క్రితం నూతన విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగ వృథాగా ఉండటంతో పూర్తిగా తొలగించకుండా కట్ చేశారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌కు కట్ చేసిన తీగను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ తీగ తగలడంతో షాక్ కొట్టి భూపని రమేష్ (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని రమేష్ ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చేతికందివచ్చిన కుమారుడి మరణంతో తండ్రి వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. విద్యుత్‌శాఖ అధికారులు, నూతనంగా లైన్ వేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం పోయిందని గ్రామస్తులు ఆరోపించారు.



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పచ్చ తమ్ముళ్ల ధన దాహం..
తుమ్మ చెట్లు మాయం..!



చెట్లను నరుకుతున్న కూలీలు



నరికివేసిన తుమ్మ చెట్లు

- కలికవాయ-బిట్రగుంట చెరువులో సుమారు రూ.40 లక్షల విలువైన తుమ్మకర్ర
- రెండు వారాలుగా అక్రమంగా చెట్లు నరుకుతున్న తెలుగు తమ్ముళ్లు
- ఇప్పటికే రూ.10 లక్షల విలువైన కర్ర తరలింపు
- మొద్దు నిద్రలో ఇరిగేషన్, పంచాయతీ, సామాజిక అటవీశాఖ అధికారులు

సింగరాయకొండ: తెలుగు తమ్ముళ్ల ధన దాహానికి రోజురోజుకూ అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే అక్రమాలతో చెలరేగిపోతున్నారు. ఇప్పటికే ఇసుక దందాలకు పాల్పడుతూ పేట్రేగిపోతున్నారు. తాజాగా తుమ్మ చెట్లను మాయం చేయడం వెలుగుచూసింది. సింగరాయకొండ మండలంలోని కలికవాయ గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు సుమారు 15 రోజులుగా ఎటువంటి అనుమతులూ లేకుండా కలికవాయ-బిట్రగుంట చెరువులో విలువైన తుమ్మ కర్ర చెట్లను నరికివేసి అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఈ చెరువులో సుమారు 40 లక్షల రూపాయల విలువైన కలప ఉంది. వాస్తవానికి చెరువులో చెట్లు నరికి రవాణా చేయాలంటే ఇరిగేషన్, సామాజిక అటవీశాఖ, పంచాయతీ శాఖాధికారుల అనుమతి తీసుకోవాలి. ఈ చెరువులో ఉన్న కలపకు సంబంధించి సామాజిక అటవీశాఖ ద్వారా ఎంత విలువైన కలప ఉందో నిర్ధారించి పంచాయతీ వారు వేలం పాట నిర్వహిస్తారు. దీని వలన ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ, ఇవేమీ జరగకుండానే టీడీపీ సానుభూతిపరుడు అన్ని శాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పానని, తనకు అడ్డే లేదని చెప్పుకుంటూ విలువైన తుమ్మ చెట్లను నరికి కలపను రవాణా చేస్తున్నాడు. బహిరంగ మార్కెట్‌లో తుమ్మచెట్ల కలపకు మంచి గిరాకీ ఉండటంతో ఇప్పటికే సుమారు 10 లక్షల రూపాయల విలువైన కలప రవాణా చేశాడని చెరువు ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదంత బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అధికారులు అవినీతికి పాల్పడి ఉంటారని, అందుకే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమంగా చెట్లు నరికి సొమ్ము చేసుకుంటున్న టీడీపీ సానుభూతిపరుడిపై తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్ రాష్ట్ర బైక్ దొంగలు అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ రత్నాకర రామరాజు



పట్టుబడిన వాహనాలతో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

- సుమారు రూ.23 లక్షల విలువైన 28 బైక్‌లు స్వాధీనం
- దొంగలు ఇద్దరు పాత నేరస్తులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రత్నాకరం రామరాజు

కనిగిరి రూరల్: అంతర్ రాష్ట్ర బైక్ దొంగలను అరెస్ట్ చేసి..వారి నుంచి సుమారు రూ.23 లక్షల విలువ చేసే మోటార్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రత్నాకరం రామరాజు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల ప్రకారం ఈనెల 14న మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పాత నేరస్తులైన మల్లెల కొండారెడ్డి, పసుపర్తి లక్ష్మీ నారాయణలను గంజాయి విక్రయాల కేసులో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక చోరీ చేసిన బైక్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో కనిగిరి ప్రాంతంలో పలు బైక్‌ల చోరీలకు పాల్పడినట్లు నిందితులు వెల్లడించారు. దీంతో కనిగిరి సీఐ, ఎస్సైలు పీటీ వారెంట్ కింద తీసుకుని ఆ ఇద్దరు నేరస్తులను అదుపులోకి కనిగిరి పోలీస్ స్టేషన్‌లో విచారించారు. పోలీసుల విచారణలో కనిగిరితో పాటు ఇతర ప్రాంతాల్లో సుమారు రూ.23 లక్షల విలువైన 28 మోటార్ బైక్ లు చోరీలు చేసినట్లు నిందితులు అంగీకరించారు. ఈమేరకు సీఐ ఖాజావలి, ఎస్సై త్యాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శోభన్‌లు ఒక టీంగా ఏర్పడి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కనిగిరిలో 3, పొదిలిలో 3, దర్శిలో 2, పామూరులో 1, సీఎస్‌పురంలో 2, కావలిలో 2, ఒంగోలులో 4, ఉలవపాడులో 1, తిరుపతి (ఈస్ట్)లో 1, నర్సరావుపేట 2, గుంటూరు 2, నూజివీడు 1, విజయవాడ 1, గుంటూరు కండ్రిక 1, టంగుటూరు 1, పొన్నలూరు 1 బైక్‌లను చోరీ చేశారు. దొంగతనాలు చేసిన బైక్‌లను వీరు కనిగిరి శివారు ప్రాంతాల్లో దాచిపెట్టి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ కేసుల్లో వీరిద్దరినీ ముద్దాయిలుగా చూపిస్తూ రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. అలాగే వీరిద్దరిపై షీట్‌లను ఓపెన్ చేసి, నిఘా పెడతామని డీఎస్పీ తెలిపారు. మోటార్ సైకిల్‌ల రికవరీలో ప్రతిభ చాటిన కనిగిరి ఎస్సై త్యాగరాజును, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను, కానిస్టేబుల్ శోభన్‌ను డీఎస్పీ ఆర్ రామరాజు అభినందించారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

● బావిలో దూకి భర్త ఆత్మహత్య



కొండలరావు మృతదేహం



కొండలరావు (ఫైల్)

పొన్నలూరు: తన భార్య ప్రవర్తన బాగలేకపోవడంతో పాటు చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పొన్నలూరు మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవెంకన్నపాలెం గ్రామానికి చెందిన తన్నీరు కొండలరావు (35)కు సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామానికి చెందిన అశ్వినితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆ తర్వాత బతుకుదెరువు నిమిత్తం తిరుపతి ప్రాంతానికి వెళ్లి బేల్దారి పనులు చేసుకుంటూ వారు జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం తిరుపతిలో రోజూ మాదిరిగానే కొండలరావు బేల్దారి పనికి వెళ్తూ పనిచేసే దగ్గరకు భోజనం తెచ్చి ఇవ్వమని భార్య అశ్వినికి చెప్పాడు. భోజనం సమయం అయినప్పటికీ అశ్విని రాకపోవడంతో కొండలరావు ఇంటికి వెళ్లాడు. ఇంట్లో భార్యాపిల్లలు కనిపించకపోవడంతో పక్కింటి వారిని విచారించాడు. పిల్లలను తీసుకుని తన పుట్టింటికి అశ్విని వెళ్లిపోయిందని పక్కింటి వారు చెప్పడంతో కొండలరావు కూడా తిరుపతి నుంచి పెదవెంకన్నపాలెం వచ్చేశాడు. తన భార్య ప్రవర్తన బాగలేదని తన తల్లితో చెప్పుకుని బాధపడ్డాడు. తన ముగ్గురు ఆడపిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడు. వాళ్లను పెంచి పెద్దచేసే బాధ్యత తీసుకోవాలని తల్లికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గురువారం సాయంత్రం సమయంలో పెదవెంకన్నపాలెంలోని తనకాలనీ సమీపంలో ఉన్న నేల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కొండలరావు తల్లి.. గ్రామస్తులకు తెలియజేసింది. అప్పటికే రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీయలేకపోయారు. శుక్రవారం ఉదయం పోలీసులకు తెలియజేయడంతో వారు వచ్చి కొండలరావు మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు.

సహిత విద్యార్థులకు టీఎల్‌ఎం ద్వారా బోధించాలి

● సహిత విద్య రాష్ట్ర సహాయక సమన్వయకర్త మల్లికార్జున్



భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మల్లికార్జున్

కొత్తపట్నం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు టీఎల్‌ఎం ద్వారా బోధించాలని సహిత విద్య రాష్ట్ర సహాయక సమన్వయకర్త జి.మల్లికార్జున్ సూచించారు. మండలంలోని భవిత కేంద్రంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల పనితీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. తొలుత జాబ్‌చార్ట్‌లోని టైం టేబుల్‌ను అనుసరిస్తున్నారా..లేదా..? అని తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సీడబ్ల్యూఎస్ పిల్లలకు సదుపాయాలపై ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించాలన్నారు. టీఎల్‌ఎం ద్వారా బోధనోపకరణాలు ఉపయోగించాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే అలవెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ట్యాబులను వినియోగిస్తున్నారా..లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ వారికి 45 ట్యాబులు, ఐఆర్టీ సిబ్బందికి 74, దృష్టి లోపం ఉన్న వారికి 23, శ్రవణ లోపం ఉన్న వారికి 75 ట్యాబులు పంపిణీ చేశామన్నారు. అందరితో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తే వారిలో వైకల్యలోపం అనే భావన కోల్పోతారన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త, సమగ్ర శిక్ష ఏఎంఓఎం రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సాయి కిషోర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు

త్రిపురాంతకం: సాగర్ కాలువలో స్నానానికి వెళ్లిన యువకుడు కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. భవన నిర్మాణ పనులు చేసే కృష్ణ (25) త్రిపురాంతకం సాగర్ కాలువ వద్ద స్నానానికి దిగి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఇతనితో పాటు మరో ముగ్గురు స్నానానికి వెళ్లగా వారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన యువకుడిది రాజస్థాన్‌గా తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు.

రోడ్డు సరే.. మరి మాకేంటి?



వెలగపూడి - అనంతవరం రోడ్డు



అనంతవరం - ఆలకూరపాడు రోడ్డు

- నిలిచిన వెలగపూడి-అనంతవరం రోడ్డు పనులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.3.45 కోట్లతో 8 కి.మీ రోడ్డు నిర్మాణం ప్రారంభం
- రోడ్డు చదును చేసి, మెటల్ తోలిన కాంట్రాక్టర్
- ప్రభుత్వం మారగానే పర్సంటేజీ కోసం పట్టుబట్టిన పచ్చ నేతలు
- పనులు ఆగడంతో ఇబ్బంది పడుతున్న 8 గ్రామాల ప్రజలు, వాహనదారులు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగితే, అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకుండా ప్రభుత్వ పెద్దలు పబ్బం గడుపుతుంటే.. అధికార టీడీపీ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుతగులుతూ ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టంగుటూరు మండలంలోని వెలగపూడి-అనంతవరం-ఆలకూరపాడు రోడ్డు నూతనంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. తీర ప్రాంతంలోని మూడు పంచాయతీల పరిధిలో 8 గ్రామాలను అనుసంధానం చేస్తూ 8 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులను రూ. 3.45 కోట్లకు దక్కించుకున్నారు. కల్వర్టులతో నిర్మించాల్సిన ఈ రహదారిపై ప్రస్తుతం కంకర లేయర్ మాత్రమే వేసి ఆపేశారు.

పర్సెంటేజీ ఇస్తేనే పనులట!

అధికారం చేతికందగానే టీడీపీ నాయకులు దందాలకు తెరలేపారనేందుకు ఈ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడమే ఓ నిదర్శనం. అడిగినంత పర్సెంటేజీ ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ససేమిరా అనడంతో టీడీపీ నేతలు రోడ్డు పనులను ఆపేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేస్తే వైఎస్సార్ సీపీకి పేరొస్తుందన్న దుగ్ధ, పర్సెంటేజీ నొక్కేయాలన్న టీడీపీ నేతల ఆశ వెరసి రోడ్డు పనులకు అడ్డంకిగా మారాయి. రోడ్డు నిర్మాణ పనులు మరింత ఆలస్యమైనా తాము అనుకున్నది నెరవేరుతుందన్న ఆలోచన ప్రజలను ఇబ్బందులపాలు చేస్తోంది.

ప్రయాణం నరకం

రోడ్డు నిర్మాణం కోసం చదును చేసిన కంకర పైకి లేవడంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మొత్తం 8 గ్రామాల ప్రజలు, ఆక్వా రైతులు ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. ప్రధానంగా ఆక్వా రంగానికి సంబంధించిన వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే మత్స్యకారులు పాకల, కొత్తపట్నం గ్రామాలకు ఇటు వైపే వెళ్తుంటారు. అనంతవరం పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు సచివాలయానికి చేరుకోవడానికి ఈ రోడ్డు మార్గాన్నే వినియోగించుకుంటారు. రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోవడం వల్ల వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.